కార్పొరేటర్ పర్యటన



రేణుకానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం రేణుకానగర్‌లో పర్యటించిన ఆమె స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగదీశాచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



చక్రిపురంలో యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, చక్రిపురం కాలనీలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సీఎం చొరవతో చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు రాబట్టాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి చర్లపల్లి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. స్థానిక నేతలు గోపాల్‌యాదవ్, బుచ్చిరెడ్డి, పాండు, అశోక్‌తో పాటుగా మహిళా నాయకులు పాల్గొన్నారు.

పేకాడుతున్న వ్యక్తుల రిమాండ్

బోడుప్పల్: పేకాడుతున్న నలుగురు వ్యక్తులను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో పేకాడుతున్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాడులు నిర్వహించిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 5వేల నగదు, ప్లేయింగ్ కార్డ్స్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

మరో స్థావరంపై దాడులు..

అల్వాల్: గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న స్థావరంపై ఎస్వోటీ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ పంచశీల కాలనీలో ఏడుగురు వ్యక్తులు పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఆ స్థావరంపై దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.2.30 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకుని అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి

మల్కాజిగిరి: స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం తిరుమలనగర్, సప్తగిరి కాలనీల్లో జలమండలి, శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ నాలాతో దుర్వాసన రావడమే కాకుండా దోమల బెడద అధికంగా ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పారవేస్తున్నారని, దీని వల్ల పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుందని, ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వ్యర్థాలను నాలాల్లో పారవేయకుండా చెత్త సేకరించే వారికే అందజేయాలన్నారు. జలమండలి జీఎం సునీల్‌కుమార్, మేనేజర్ నవీన్, ఏఈ సత్యలక్ష్మి, ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఎస్‌ఎస్ శ్రీనివాస్, వీఐ రజనీకాంత్ తదితరులున్నారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక



బోడుప్పల్: పీర్జాదిగూడలోని బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా మునుకుంట్ల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రావు నాగిరెడ్డి, కోశాధికారిగా మునుకుంట్ల ప్రదీప్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీని పీర్జాదిగూడ మాజీ డిప్యూటీ సర్పంచ్ దర్గ దయాకర్‌రెడ్డి అభినందించారు.

కష్టాల కడలిలో బతుకులు !

• కుమ్మరుల జీవితం కడు దైన్యం • మట్టి పాత్రలకు గిట్టుబాటు కరువు • కృత్రిమ ధాతికి విలవిల

దీపావళి వచ్చిందంటే ఏ ఇంట్లోనైనా ప్రమిదలతో అందంగా అలంకరిస్తారు. చల్లటి నీళ్లను అందించే కుండను కూడా మట్టి నుంచే తయారు చేస్తారు. ఇదంతా నాణేనికి ఓ వైపు.. అదే కుండలను తయారు చేసే మట్టి మనుషుల (కుమ్మరి కులస్తుల) జీవనచక్రం అందుకు భిన్నంగా ఉంటోంది. మట్టి సేకరణ నుంచి వస్తువుల తయారీ వరకు వారు పడే తపన అంతా ఇంతా కాదు. రెడీమెడ్ భూతం సమీప ప్రాంత ప్రజల ఉపాధికి గండికొడుతోంది. తాము తయారుచేసిన వస్తువులు అమ్ముడుపోకపోవడంతో వారు ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్నారు.

– జవహర్‌నగర్





మట్టితో తయారు చేసిన ప్రమిదలు

దిగుమతులతో అవస్థలు..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనేక మంది కుమ్మరులు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కుండలు, దుత్తలు, కుండీలు, ప్రమిదలు తదితర వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఒకప్పుడు ఎంతో ఆనందంగా జీవించిన కుమ్మరులు ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులతో గిరాకీ లేక కష్టాల కడలిలో ఎదురీదుతున్నారు. గతంలో ఎడ్లబండ్లలో కుండలు, పాత్రలు, ప్రమిదలు తీసుకొచ్చారంటే గంటలో అమ్ముడయ్యేవి. ప్రస్తుతం ప్లాస్టిక్ కుండలు, పాత్రలు, రెడీమెడ్ దీపాలు వారి ఆదాయానికి గండికొడుతున్నాయి. దీపావళి పండుగ వస్తుందంటే చాలా వారి ఇళ్లలో నిత్యం కనిపించే కొనుగోలుదారుల సందడి కనుమరుగైంది. రాజస్థాన్, బెంగళూర్ ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు దీపాలు, ఇతర కళాకృతులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రంగులు, వివిధ ఆకృతులు, డిజైన్లు ఉండటంతో వాటినే కొనుగోలు చేయడానికి ప్రజలు మొగ్గుచూపుతున్నారు.

కుండెడు కష్టాలు...

మట్టిని పాత్రగా మలిచే క్రమంలో వారి కష్టాలు వర్ణణాతీతం. కష్టపడి తయారు చేసినా మార్కెట్లోకి వెళ్లే సరికి నిరాశే ఎదురవుతోంది. ఇతర ప్రాంతాల్లో యంత్రాలతో తయారు చేసి తీసుకొచ్చే ప్రమిదలే అందుకు కారణం. యంత్రాల పోటీని కుమ్మరులు తట్టుకోలేకపోతున్నారు.

ఖర్చెక్కువ.. గిట్టుబాటు తక్కువ

కష్టపడి రంజన్లు చేసినా గిట్టుబాటు దొరకకపోవడంతో సంపాదన పెద్దగా ఏమీ ఉండటం లేదు. దినసరి కూలీలకన్నా తక్కువే.. ఆదాయం ఉంటోంది. కొందరైతే అప్పుచేసి మరీ కుండలు తయారు చేస్తున్నారు. అయితే వీరికి ప్రభుత్వ పరంగా రుణాలేవి అందడం లేదు.

మా వృత్తికి సహకారం అందించాలి

ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. మిషన్లపై తయారు చేసిన ప్రమిదలు తీసుకురావడంతో మేము చేతితో చేసిన వాటిపై ప్రజలు మక్కువ చూపడం లేదు. మేము కూడా అలాంటివి చేద్దామనుకుంటే ఆ మిషన్ల ఆచూకీ తెలవడం లేదు. దీంతో చాలా నష్టపోతున్నాం. మా వృత్తిని అభివృద్ధి చేద్దామంటే ఏ సహాయ సహకారాలు అందడం లేదు.

– సత్యనారాయణ, అంబేడ్కర్‌నగర్

ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలి



తాతల నుంచి కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సహకారం అందలేదు. అనేకసార్లు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదు. జవహర్‌నగర్‌లో మాకు అనువైన చోట ప్రభుత్వం పదెకరాల స్థలం కేటాయిస్తే ఆధునిక యంత్రాలతో కుండలను తయారు చేసి, శివారు పట్టణాలకు అందిస్తాం. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి స్థలాలు కేటాయించి రుణాలు ఇప్పించాలి.

– ఆరూరి నర్సింహ, బాలాజీనగర్

కులవృత్తులకు ప్రాధాన్యతనిస్తున్నాం



ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తోంది. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో కుమ్మరులు దుర్భర జీవితాలను గుడుపుతున్నారు. ఇక్కడ సరైన స్థలం లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కుండలు కొనుగోలు చేసుకుంటున్నారు. స్థలం కేటాయించాలని కుమ్మరి సంఘం సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంది. వీలైనంత త్వరలో కుమ్మరి కులస్తులకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌యాదవ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

పీహెచ్‌సీలో సీపీఆర్‌పై అవగాహన



అల్వాల్ పీహెచ్‌సీలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అల్వాల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ చేయడం ద్వారా కార్డియక్ సమస్యలతో వచ్చే మరణాలను అదుపు చేయవచ్చన్నారు. సీపీఆర్ విధానం ద్వారా గుండెకు రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుందని, నోటి ద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ఆకస్మికంగా గుండెపోటుతో కుప్పకూలితే వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, వాహనం వచ్చేంత వరకు సీపీఆర్ చేస్తే నిండు జీవితాన్ని కాపాడినవారమవుతామన్నారు. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, డీఈ తిమ్మప్ప, డాక్టర్లు శైలజ, అనఘ, నాయకులు సురేందర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్లాలి



కార్పొరేటర్ శిరీషాసోమశేఖర్‌రెడ్డితో కాలనీవాసులు

కాప్రా: అభివృద్ధే లక్ష్యంగా మనమంతా ముందుకెళ్లాలని ఏఎస్‌రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించి సత్కరించారు. కాలనీల అభివృద్ధే తన లక్ష్యమని, అందులో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమన్నారు. కాలనీలో ఏ సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, ప్రధాన కార్యదర్శి సద్గుణచారి, సంయుక్త కార్యదర్శి చంద్రారెడ్డి, ఎన్.శశిధర్‌రావు, నరసింహారెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి తదితరులున్నారు.

స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరణ



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని సర్వేనంబర్ 376లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి నోటీసులు అందుకున్న వ్యక్తులకు హైకోర్టులో చుక్కెదురైంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించారని, అటు రెవెన్యూ అధికారులు, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. దీంతో స్టే కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన కోర్టు 'అసలు అవి ప్రభుత్వ భూములా.. కదా.. ? అనేది తహసీల్దార్ లేదా కలెక్టర్ నిర్ధారించాలని' తేల్చి చెప్పింది. ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యంగా ముందుకెళ్తున్న స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి ప్రతివాదిగా ఉన్నారు. సదరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారని తెలుసుకుని చివరి నిమిషయంలో తన న్యాయవాది ద్వారా న్యాయమూర్తికి తమ వాదనను వినిపించారు. శిరీషసోమశేఖర్‌రెడ్డి వాదనతో ఏకీభవించిన కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.

ప్రజా అవసరాలకు ఉపయోగించాలి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించాలనుకునేవారు ఇప్పటికైనా కోర్టు తీర్పుతో దురాలోచనలు మానుకోవాలని కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి హితవు పలికారు. కబ్జాదారులపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు, కాప్రా మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ తదితరులున్నారు.

పరామర్శ

రామంతాపూర్: డివిజన్ కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ తండ్రి ఎరుకల మల్లేష్‌గౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆకారపు అరుణ్‌పటేల్, కాంగ్రెస్ నేతలు శ్రీకాంత్‌యాదవ్, సందీప్‌పటేల్, భాస్కర్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలను చేపడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ మంగళవారం మేడిపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్‌నగర్ ఫేస్– 3, బిస్కెట్ గోడౌన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, పెట్రోల్‌బంక్ వెనక వైపు ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

శివాలయం భూమి లీజుకు వేలం

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని దేవాదాయశాఖ ఆధీనంలో మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన రామంతాపూర్ భగాయత్ సర్వే నెంబర్–1లోని 1.12 గుంటల ఖాళీ స్థలాన్ని దేవాదాయశాఖ ఉపకమిషనర్ ఉత్తర్వుల ప్రకారం మూడేళ్ల కాలానికి లీజుకు ఇచ్చేందుకు ఈనెల 22న బుధవారం ఉదయం 10.30లకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల వారు 9848966212.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు తగిన ప్రాధాన్యం ఇస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం బలరాంనగర్‌లో రూ.10 లక్షలతో యూజీడీ, రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొంతమంది అధికారుల అలసత్వం ప్రణాళికలు లేకపోవడంతో నిధులు మంజూరైనా పనులు ప్రారంభించడం లేదన్నారు. జీహెచ్‌ఎంసీలో నిధుల కొరత ఉన్నప్పటికీ నిధులు మంజూరు చేయిస్తున్నామన్నారు. ఏఈ నవీన్, వీఐ రమేష్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయినగర్, చక్రిపురం, రామకృష్ణనగర్, డబుల్‌బెడ్రూం, లక్ష్మీనగర్, డీసీకాలనీ, చర్చికాలనీ, పెద్ద చర్లపల్లి, సాయిగణేష్‌నగర్, ఈసీనగర్, బీఎన్‌రెడ్డినగర్ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి స్థానికులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. చర్లపల్లి డివిజన్ సమగ్రాభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డీఈ బాలకృష్ణ, బీఆర్‌ఎస్ నేతలు, స్థానికులు డప్పు గిరిబాబు, మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రాజు, రాఘవరెడ్డి, అనిల్, పాండు, అశోక్, వినోద్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో రూ.90 లక్షలతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పనులకు మంగళవారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రి నుంచి వెళ్తున్న ఓపెన్ నాలాతో ఇబ్బందులు పడుతున్నారని అండర్ డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్నపూర్ణ కాలనీలో రూ.10 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈఎస్‌ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబు, రాంరెడ్డినగర్ కాలనీవాసులు, అన్నపూర్ణ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సుస్థిరాభివృద్ధిపై అవగాహన



అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, నేషనల్ గ్రీన్‌కార్ప్స్(ఎన్‌జీసీ) సంస్థ సంయుక్తాధ్వర్యంలో పర్యావరణ సుస్థిరాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులు దీపావళి పండుగకు వాడే దీపపు మట్టి ప్రమిదల నుంచి సంప్రదాయ పద్ధతిలో చేసిన వంటకాల వరకు పర్యావరణహిత వస్తువులను ప్రదర్శించారు. అనంతరం జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జగన్, డాక్టర్ హరిత, డాక్టర్ ప్రదీప్‌లు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంస్థ డైరెక్టర్ చైతన్య, అక్షయ్ దేశ్‌పాండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి

బోడుప్పల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో జరిగే మంచి చెడులను గురించి తెలుసుకోవాలని, తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. ఎస్సైలు నర్సింగ్‌రావు, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం !



బురదమయంగా ఉప్పల్ మినీ శిల్పారామం ప్రవేశ మార్గం (ఫైల్)

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఉప్పల్ మినీ శిల్పారామం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో ఏర్పాటు చేసిన శిల్పారామం పట్టణవాసులకు అహ్లాదాన్ని పంచేందుకు నిర్మించారు. ఇక్కడికి ప్రతిరోజు దాదాపుగా 600 నుంచి 800 వరకు చుట్టు పక్కల వారు సేద తీరడానికి వస్తుంటారు.సెలవులు, శని, ఆదివారాలు, పండుగల్లో 2000లకు పైగానే సందర్శకులు వచ్చిపోతుంటారు. అలాంటి శిల్పారామానికి వెళ్లాలంటే బురదమయమైన రోడ్డు మీదుగా వెళ్లాల్సిందే. ద్విచక్రవాహనదారులు అదుపు తప్పితే కుటుంబంతో సహా ప్రమాదాల భారిన పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన శిల్పారామానికి రోడ్డు వేయాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

కొనసాగుతున్న పల్స్ పోలియో



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ శాంతి



అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, డాక్టర్లు శైలజ, అనఘ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు తప్పకుండా వేయించాలి..

బోడుప్పల్: పోలియో మహమ్మారి బారిన పడకుండా ఉండేందుకు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు మంగళవారం ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా 0– 5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి మహమ్మారి బారిన పడకుండా ఉండాలన్నారు.

రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డివిజన్‌లోనే కాకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పార్టీలకతీతంగా చేపడతున్నట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉప్పల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. భరత్‌నగర్‌లో కొన్నేళ్లుగా మురుగు సమస్య ఉందని, శాశ్వత పరిష్కార దిశగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఏఈ సత్యనారాయణ, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డితో కలిసి లక్ష్మీనర్సింహకాలనీలో పర్యటించారు. అక్కడి వారి సమస్యల విన్న అనంతరం త్వరలోనే ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. డీఈ వినీల్‌గౌడ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.